సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అమ్మాజీకి ఆదర్శ మహిళా సమన్వయకర్త పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అమ్మాజీ

ఎంవీపీకాలనీ: నగరానికి చెందిన భూపతిరాజు అమ్మాజీకి శ్రీ సత్యసాయిబాబా సేవా సంస్థల ఆదర్శ మహిళా సమన్వయకర్త పురస్కారం లభించింది. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జరుగుతున్న అంతర్జాతీయ మహిళా సదస్సులో భాగంగా ఆమెకు సంస్థ ప్రతినిధులు ఈ అవార్డును అందజేశారు. ప్రస్తుతం అమ్మాజీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్‌కు మహిళా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్నేళ్లుగా మహిళలకు అందిస్తున్న సేవలకు గాను అమ్మాజీని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, విశాఖ ప్రతినిధులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఎస్‌సీపీసీఆర్ నియామకాల్లో విద్యార్హత సడలించాలి

ఎంవీపీకాలనీ: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపీఎస్‌సీపీసీఆర్) అధ్యక్షుడు, సభ్యుల నియామకాల్లో విద్యార్హతను సడలించాలని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు ఎ.ప్రవీణా త్రినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయా పదవులకు పీజీని విద్యార్హతగా పేర్కొందన్నారు. జాతీయ, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్లు గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్లను పరిశీలించి ప్రస్తుత నోటిఫికేషన్‌ను మార్పు చేయాలన్నారు. విద్యార్హతను సడలించి గతంలో మాదిరిగా పిల్లలకు చేసిన సేవలను ప్రామాణికంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మధురానగర్ హైస్కూల్ హెచ్‌ఎం బాధ్యతల స్వీకరణ



హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీ నరస

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయినిగా శుక్రవారం లక్ష్మీ నరస బాధ్యతలు స్వీకరించా రు. ఇటీవల జరిగిన బదిలీల్లో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న లక్ష్మీ నరస ఈ స్కూల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేసిన శాంతికుమారి రైల్వే న్యూకాలనీ కేఎస్‌ఎం స్కూల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరస మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందిస్తానని తెలిపారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసి పూజ

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

అప్రమత్తతే దివ్య ఔషధం





పాత వెంకోజిపాలెం యూపీహెచ్‌సీ ల్యాబ్‌లో వైద్య పరీక్షలు

- వాతావరణంలో మార్పులతో వ్యాధుల భయం
- చిన్నారులు, వృద్ధులకు జాగ్రత్తలు అవసరం
- జ్వర లక్షణాలుంటే తక్షణం వైద్యులను సంప్రదించాలి

మద్దిలపాలెం: వ్యాధులు ప్రబలే సమయం ఆసన్నమైంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో మధ్యాహ్నం వరకు మండుటెండ ఉంటూ.. అప్పటికప్పుడు ఆకాశం మేఘావృతమై వర్షం పడుతోంది. కొన్ని రోజులుగా ఎండ వేడిమితోపాటు ఉక్కపోత అధికమైంది. ఉదయం 7 గంటలకే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. సాయంత్రం 5 అయ్యే సరికి వాతావరణం చల్లబడి గాలులు వీస్తున్నాయి. ఒక్కోసారి వర్షాలు పడుతున్నాయి. గత నాలుగైదు రోజులుగా మండే ఎండలు, కాసేపు వర్షాలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ విధంగా జరిగే వాతావరణ మార్పులతో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశముంది. ఈ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. వాతావరణ మార్పులతో ఎదురయ్యే సమస్యల విషయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. పాత వెంకోజీపాలెం, ఇసుకతోట యూపీహెచ్‌సీల్లో రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు చేస్తున్నారు. పేషెంట్ల అనారోగ్య సమస్యలను వైద్యాధికారి, సిబ్బంది తెలుసుకుంటూ తగిన సూచనలు, సలహాలిస్తూ.. వైద్య సేవలందిస్తున్నారు.



మహిళకు వైద్యం చేస్తున్న ఆరోగ్య కేంద్రం సిబ్బంది

తలెత్తే అనారోగ్య సమస్యలు

ఒకే రోజు అధిక ఉష్ణోగ్రతలు, వర్షాలు పడుతూ చల్లబడిన వాతావరణంతో మొక్కల నుంచి పుప్పొడి రేణువులు గాలిలో కలుస్తాయి. దీంతో ఆస్తమా, **ఎలర్జీ, గొంతునొప్పి, తుమ్ములు ఎక్కువగా రావడం, న్యూమోనియా, బ్రాంకైటీస్, ముక్కు కారడం వంటి సమస్యలు వస్తాయి. వాతావరణంలో అధిక ఉష్ణోగ్రత, తేమ ఉన్నప్పుడు చెమట పట్టి ఫంగస్, బ్యాక్టీ**రియా ఇన్ఫెక్షన్ రావడానికి అవకాశముంటుంది.

నీటి నిల్వలు తొలగించాలి

ఇళ్లు, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలుంటే వాటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలి. లేకపోతే నీరు నిలిచిన ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయి. వీటి వల్ల డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. దోమల నిర్మూలనకు నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతోపాటు పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి.

నీటి కలుషితంతో ఇబ్బందులు

నీరు కలుషితం కావడం వల్ల వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. మైగ్రేన్ వంటి సమస్యలు ఉన్న వారికి మరింత ఇబ్బందిగా ఉంటుంది. చిన్న పిల్లలు, వృద్ధుల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో త్వరగా వడదెబ్బకు గురవుతారు. సోడియం, పొటాషియం లవణాల సమతుల్యతలో తేడా ఏర్పడి ఇబ్బంది పడతారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇంటి గదుల్లోకి గాలి, వెలుతురు బాగా వచ్చేలా చూసుకోవాలి. దీని వల్ల గాలి నుంచి వచ్చే ఇన్ఫెక్షన్లను **నివారించ**వచ్చు. లూజుగా ఉండే కాటన్ **దుస్తులు ధరించ**డం మంచిది. వృద్ధులు మం**డుటెండలో తిర**గకూడదు. రక్తపోటు, మధుమేహ **వ్యాధిగ్రస్తులు** ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. నూనె పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తినాలి. నీరు ఎక్కువగా తాగాలి. దాహం వేయకున్నా ప్రతి అరగంటకు కొద్దిగా మంచినీరు తాగుతూ ఉండాలి. రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు విటమిన్‌–సీ ఎక్కువగా ఉండే సిట్రస్ పళ్ల రసాలు, తాజా కూరగాయలు తీసుకోవాలి.



పేషెంట్ల సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ రెహినిషా

నిర్లక్ష్యం చేయవద్దు



వాతావరణంలో మార్పుల కారణంగా వృద్ధులు, చిన్నారుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి. జ్వరం, బలహీనత, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దు. ఇలాంటి సమయంలో సొంత వైద్యం కాకుండా తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందాలి. డాక్టర్లు సూచించిన మందులు మాత్రమే వాడాలి.

– డాక్టర్ రెహినీషా, వైద్యాధికారి, పాత వెంకోజీపాలెం యూపీహెచ్‌సీ

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ముఖద్వారానికి మరమ్మతులు



మద్దిలపాలెం వైపు గల ముఖద్వారానికి చేస్తున్న మరమ్మతులు

మద్దిలపాలెం: మద్దిలపాలెం వైపు గల ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ముఖద్వారం ఇటీవల భారీ వాహనం ఢీకొట్టడంతో దెబ్బతింది. ఈ ద్వారం గుండా మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పైగల వాల్తేరు ప్రధాన రహదారికి వెళ్లేందుకు వాహనాల రాకపోకలు ఆటంకం ఏర్పడింది. కొన్ని రోజులుగా ఒకవైపు మార్గాన్ని మూసివేయడంతో కళాశాలకు వచ్చే ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులతో పాటు వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఏయూ ఇంజినీరింగ్ విభాగం స్పందించి రెండు రోజులుగా శిథిలమైన ముఖద్వారానికి మరమ్మతులు చేపడుతోంది. దీంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్

మద్రిపాలెం: గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు జీఆర్‌పీ సీఐ ధనంజయ నాయుడు తెలిపారు. కాకినాడ జిల్లా తిమ్మాపురానికి చెందిన కొప్పిశెట్టి రాజేష్, తాడేలు నాగవెంకట శేషు అనే వీరిద్దరిని శుక్రవారం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సమయంలో గుర్తించి అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్టు చెప్పారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

కూటమి నాయకుల నుంచి ప్రజల భూములను కాపాడాలి

కౌన్సిల్‌లో 20వ వార్డు కార్పొరేటర్

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు ఈస్ట్ పాయింట్ కాలనీలోని ప్రజల భూములు.. కూటమి నాయకుల చేతుల్లో కబ్జా కాకుండా కాపాడాలని కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్ కోరారు. శుక్రవారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమె కుర్చీపై నిల్చొని కూటమి నాయకుల కబ్జాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈస్ట్ పాయింట్ కాలనీకి చెందిన లెండి వనం, సాయిబాబా చావిడి పార్కులు కూటమి నాయకుల కనుసైగలతో కబ్జాకు గురవుతున్నాయని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కౌన్సిల్‌కు, జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే.. స్థానికులకు పార్కులను అప్పగించాలని అప్పటి కమిషనర్ అధికారులను ఆదేశించారన్నారు. ఆ తరువాత కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి మళ్లీ కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లేలా చేశారని వివరించారు. తక్షణమే ఈ కాలనీకి చెందిన పార్కులను నివాసులకు అప్పగించి కబ్జాదారుల నుంచి విముక్తి కలిగించాలని కోరారు.



కౌన్సిల్‌లో పార్కుల కబ్జాపై నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్

కిశోర బాలికలకు వ్యాయామం, క్రీడలు అవసరం

మద్దిలపాలెం: కిశోర బాలికలు శారీరకంగా దృఢంగా ఉండేందుకు, ఆరోగ్యానికి వ్యాయామంతో పాటు క్రీడలు అవసరమని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ ఏసీడీపీవో శ్రీలత అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేఆర్‌ఎం కాలనీ–1 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు ఆటలు, వ్యాయామంపై ఆమె అవగాహన కల్పించారు. విద్యతోపాటు క్రీడలు, వ్యాయామం ఎంతో అవసరమన్నారు. పౌష్టికాహారం లాభాల గురించి తెలియజేశారు. ఈ అంశాల్లో బాలికల సందేహాలను తెలుసుకుని, వాటి నివృత్తి చేశారు. మద్దిలపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ సెల్వియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఆర్. సుబ్బలక్ష్మి, ఎంఎస్‌కే, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్, కిశోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో శ్రీలత

కుటుంబం చెంతకు బిహార్ వాసి

అల్లిపురం: నల్లమందుకు అలవాటు పడి మతిస్థిమితం కోల్పోయి రోడ్డున పడ్డ బిహార్ వ్యక్తిని ఏయూటీడీ సభ్యులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. జీవీఎంసీ ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం, దర్భంగ జిల్లా సిసపునా గ్రామానికి చెందిన రాంబిహారి ఇల్లు వదిలిపెట్టి లూథియానా వెళ్లిపోయాడు. అక్కడ బిచ్చగాళ్లతో స్నేహం చేసి నల్లమందుకు అలవాటుపడ్డాడు. దీంతో మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో మత్తులో ఎక్కడెక్కడో తిరిగి విశాఖ చేరుకున్నాడు. గత ఏడాది నవంబర్‌లో రైల్వే స్టేషన్‌లో ఏయూటీడీ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో అతను పట్టుబడ్డాడు. అతన్ని షెల్టర్‌కు తరలించి పూణేకి చెందిన శ్రద్ధ ఫౌండేషన్ సహకారంతో చికిత్స అందించడంతో అతని ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. దీంతో అతన్ని నేరుగా బీహార్‌లోని అతని స్వగ్రామానికి తీసుకెళ్లి అతని తల్లి కౌశల్య ముఖియా, సోదరుడు రాజ్‌కుమార్ ముఖియాకు అప్పగించారు. దీంతో వారు ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



కుటుంబ సభ్యులకు రాంబిహారీని అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ ప్రతినిధి

స్టీల్‌ప్లాంట్ రక్షణకు 14న రక్తదానం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకై ఈనెల 14న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం గోడపత్రికను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన ఏడుసార్లు రక్తదానం చేసి స్టీల్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా 1600 రోజులుగా ఐక్య పోరాటాలు చేస్తున్నామన్నారు. కాని ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించి కార్మికుల జీవితాలను, ప్లాంట్ భవిష్యత్తును మరింత సంక్షోభంలోకి నెట్టే విధంగా చర్యలు చేపడుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మిక వర్గం మరింత ఐక్యంగా తమ రక్తాన్ని దానం చేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాహకులు బి. అప్పారావు మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా జూన్ 14న అంబేడ్కర్ కళాక్షేత్రంలో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ నాయకులు పి. శ్రీనివాసరాజు, కె.గంగాధర్, పూర్ణచంద్రరావు, కె. శ్రీనివాస్, కొయిలాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ

పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్ స్టేషన్ భవన మరమ్మతు పనులు పూర్తవడంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం దాన్ని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోలీస్ స్టేషన్ భవనం వర్షాలకు కారుతూ, కార్యాలయంలో ఉన్న ఫైళ్లు తడిసిపోతున్నాయని తెలుసుకుని పోలీస్ వెల్ఫేర్ సంక్షేమ నిధి నుంచి రూ. 2 లక్షలు కేటాయించి మరమ్మతులు చేయించినట్లు కమిషనర్ తెలిపారు. భవనం ప్రారంభం అనంతరం, పోలీస్ కమిషనర్ సిబ్బందితో సమావేశమయ్యారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీ–2 మేరీ ప్రశాంతి, హార్బర్ ఏసీపీ కాళిదాస్, న్యూపోర్టు సీఐ కామేశ్వరరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ ప్రారంభిస్తున్న నగర సీపీ శంఖబ్రత బాగ్చి

ప్రారంభానికి మోక్షమెప్పుడో..?

- అందుబాటులోకి రాని సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ అండ్ సిటీ డయాగ్నస్టిక్ సెంటర్
- సిద్ధంగా భవనం.. వినియోగంలో లేని వైనం



విమ్స్ ఆవరణలో నిర్మించిన సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ అండ్ సిటీ డయాగ్నస్టిక్ సెంటర్

ఆరిలోవ: ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ అండ్ సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవం కోసం ఎదురుచూస్తోంది. హనుమంతవాక వద్ద విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో నిర్మించిన ఈ సెంటర్ నేటికీ అందుబాటులోకి రాలేదు. ఇది ఎప్పుడు వినియోగంలోకి వస్తుందో ఎవ్వరికీ తెలియని పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.20 కోట్లతో ఈ సెంటర్ నిర్మాణం చేపట్టింది. నగరంలోని పేద, మధ్య తరగతి రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు, స్కానింగ్‌లు ఇక్కడ అందుబాటులోకి రానున్నాయి. ఐదు జిల్లాలకు సంబంధించిన ప్రభుత్వ ఆస్పత్రులకు అవసరమైన మందులన్నీ ఇక్కడ సిద్ధంగా ఉంచుతారు.

విమ్స్ ఆవరణలో నిర్మాణం

విమ్స్ ఆవరణలోని బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు ద్వారం సమీపంలో సుమారు అరెకరం స్థలాన్ని సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్మాణం కోసం 2021లో కేటాయించారు. వేగంగా దీని నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అప్పట్లో అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. దీని పనులు ప్రారంభించినప్పటి నుంచి నత్తనడకనే జరిగాయి. ఏడాదిన్నర కాలంలో అందుబాటులోకి తీసుకువాల్సిన ఈ సెంటర్ భవన నిర్మాణం పనులు పూర్తిచేయడానికి నాలుగేళ్లు పట్టింది.

నగరవాసులకు ఉచితంగా పరీక్షలు

2024 మార్చి నాటికి భవన నిర్మాణం పూర్తయినప్పటికీ అదే ఏడాది ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికల హడావుడి పేరుతో అధికారులు భవనం లోపల ఫ్లోరింగ్, విద్యుత్ వైరింగ్, ల్యాబ్‌కు అవసరమైన పరికరాల ఏర్పాటు, సీలింగ్ తదితర పనులు జరపకుండా వదిలేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ పనులు చేపట్టడానికి సుమారు పది నెలలకు పైగా సాగదీసుకొచ్చారు. ఇప్పుడు భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ వినియోగంలోకి తీసుకురాకుండా అధికారులు నిరుపయోగంగా వదిలేశారు. ఇది అందుబాటులోకి వస్తే నగరవాసులకు ఇక్కడ ఉచితంగా రక్త పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు చేయనున్నారు. ప్రస్తుతం చిన్నపాటి జ్వరానికి సైతం వైద్యులు వివిధ రక్త పరీక్షలు, స్కానింగ్‌లు చేయించాలని రిఫర్ చేస్తున్నారు. ఆయా పరీక్షలు చేయడానికి రోగులకు బయట ల్యాబ్‌ల్లో రూ.వేలల్లో ఖర్చవుతోంది. ఇంత ఉపయోగకరమైన డయాగ్నస్టిక్ సెంటర్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రైడేతో దోమల నిర్మూలన



డ్రమ్ములో పెరుగుతున్న దోమ లార్వాలను పరిశీలిస్తున్న హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్

సీతంపేట: వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. ఏఎన్‌ఎం, ఆశా, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. కుండీలు, డ్రమ్ముల్లో లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తించి, ఆ నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజులు దాటి మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలుగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశముందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని, వారానికి ఒక రోజు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకుల్లో నీటిని తొలగించి ఆరబెట్టి మళ్లీ నీటిని పట్టుకోవాలని సూచించారు.

వాల్తేర్ డివిజన్‌లో లెవెల్ క్రాసింగ్ అవగాహన వారోత్సవాలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో శుక్రవారం అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ అవగాహన వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా జూన్ 5 నుంచి వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ రైల్వేస్ ప్రతి ఏడాది లెవెల్ క్రాసింగ్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఇండియన్ రైల్వేస్ ఈ ఏడా మంచి నిర్ణయాలు తీసుకునేందుకు ప్రజలకు సహకరిద్దాం అనే నినాదంతో, ప్రతి సారి మంచి నిర్ణయాలు తీసుకుందాం అనే స్లోగన్‌తో అవగాహన కార్యక్రమాలను ప్రారంభించింది. సివిల్ డిఫెన్స్ సభ్యులు, సివిల్ ఇంజినీరింగ్ సిబ్బంది, రైల్వే భద్రతా సిబ్బంది పలు బృందాలుగా ఏర్పడి ప్రజలు కూడుకునే ప్రాంతాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు, స్ట్రీట్ ప్లేలు నిర్వహించారు. దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ జెండా ఊపి ప్రారంభించారు. భద్రత లేని లెవెల్ క్రాసింగ్స్ వద్ద ట్రాక్స్ దాటడం వల్ల కలిగే ప్రమాదాలు, అనర్థాలను వివరించారు. కార్యక్రమాల్లో సీనియర్ డివిజన్ సేఫ్టీ ఆఫీసర్ ఎంకే సాహూ, డివిజనల్ పీవే ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వై.రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



డీఆర్‌ఎం కార్యాలయం వద్ద స్ట్రీట్ ప్లే నిర్వహిస్తున్న సివిల్ డిఫెన్స్ బృంద సభ్యులు

ఘనంగా స్నాతకోత్సవం

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న సేఫ్టీ కోర్సులకు స్నాతకోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ కోర్సుల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ జారీ చేసిన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముఖ్య అతిథి జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకరరెడ్డి, విశిష్ట అతిథి స్టీల్‌ప్లాంట్ జీఎం(శిక్షణ, హెచ్‌ఆర్‌డీ) టి.కె.ఎస్.ఆర్.ఠాగూర్ శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సేఫ్టీ కోర్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, కరిక్యులం కో ఆర్డినేటర్ ఎ.వరహాలు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వి.శ్రీకాంత్ పాల్గొన్నారు.



ముఖ్య అతిథులతో సేఫ్టీ కోర్సుల సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ఆర్టీసీ సిబ్బందికి యోగా తరగతులు



యోగా సాధన చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

డాబాగార్డెన్స్: ఈ నెల 21న ఆర్‌కే బీచ్ వేదికగా నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రలో భాగంగా శుక్రవారం ఆర్టీసీ సిబ్బందికి విశాఖపట్నం డిపోలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ డిపో మేనేజర్ కె. గంగాధరరావు యోగా ప్రాముఖ్యత సిబ్బందికి వివరిస్తూ, ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిపో ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.